ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 18 | సంచిక : 02 | అక్టోబర్ 2012

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 16
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)
చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-
చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥
పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
08814 - 224747
9247104551

ఈ సంచికలో....

ఐ-భీమవరం ... 01-09-2012
జిన్నూరు ......... 28-08-2012

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 01-09-2012, ఐ-భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు రమణస్వామి అరుణాచలం విచ్చేసిన రోజు. భగవాన్ పేరు వెంకటరమణ. అందరూ వెంకటరామన్ అని పిలిచేవారు. రమణమహర్షి అని నామకరణం చేసినవారు గణపతిముని. డబ్బుని సంపాదించటంకంటే సద్వినియోగం చేయటం కష్టం. డబ్బుఉందని మీరు దుబారా చేయకూడదు, సద్వినియోగం చెయ్యాలి. భారతదేశంలో తిండి లేకుండా బాధపడేవాళ్ళు, ఇల్లు లేకుండా బాధపడేవాళ్ళు అనేక మంది ఉన్నారు. పిల్లలకి తెలివితేటలు ఉండి చదువు చెప్పించుకోవటానికి అవకాశం లేనివాళ్ళు అనేకమంది ఉన్నారు. వారికి ఏమీ సహాయసహకారములు అందించకుండా మనం డబ్బుని భోగాలకు వృధా చేస్తూ ఉంటే భగవంతుడు మనలను క్షమించడు. కొంతమంది ధనం ఉందని అలవాట్లు పెంచుకుంటారు. చనిపోయిన తరువాత ఈ ధనం కూడారాదు. అలవాట్లుకూడా వచ్చేస్తాయి. అందుచేత మనం నిరాడంబరంగా ఉండటం, నిర్వికారంగా ఉండటం నేర్చుకోవాలి. మనం ఎక్కువ ఖరీదైన బట్టలు వేసుకుంటూఉంటే మనలో ఏదో ప్రత్యేకత ఉందనే బుద్ధి మనకు కలుగుతుంది. నెమ్మదిగా మన మెదడుని అది పాయిజన్ చేస్తుంది. అందుచేత మీకు విద్య పెరిగినా, ధనం పెరిగినా అలవాట్లు పెంచుకోకూడదు. మీరు అలవాట్లకి బానిసలు అవ్వకూడదు. సత్పురుషుల సహవాసం చేస్తే మీరు అభివృద్ధిలోనికి వస్తారు. సత్పురుషులు కాని వాళ్ళతోటి స్నేహం చేస్తే మీరు పతనం అవుతారు. మీ పిల్లలు ఎటువంటి స్నేహాలు చేస్తున్నారు, ఏం పుస్తకాలు చదువుతున్నారు, వారు ఇంటిలోంచి బయటికి వెళ్ళాక వారి ప్రవర్తన ఎలాగ ఉందో మీరు చూసుకుంటూ ఉండాలి. అవసరమైతే పిల్లలకి బెత్తం వాడవలెను అని బైబిల్‌లో చెప్పాడు. పిల్లలని క్రమశిక్షణలో పెట్టటానికి అవసరమైతే ఒక

దెబ్బ కొట్టాలి. ఎక్కువ గారం పెట్టినా పిల్లలు పాడైపోతారు.

కారుని కండిషన్‌లో ఉంచుకోవాలి, ఎందుచేతనంటే మన గమ్యాన్ని చేరుకోవటం కోసం. అలాగే మన శరీరాన్ని, మనస్సుని కండిషన్‌లో పెట్టుకోవాలి. ఎందుచేతనంటే మన గమ్యం మన హృదయంలో ఉన్న పరమాత్మ, అక్కడకు చేరుకోవటానికి మన మనస్సు, శరీరం కండిషన్‌లో ఉండాలి. మన హృదయంలో ఉన్న చావుపుట్టుకలతోటి సంబంధంలేని సద్వస్తువుతోటి నువ్వు తాదాత్మ్యం పొందటానికి నీ దేహము, మనస్సు సహకరించాలంటే అవి కండిషన్‌లో ఉండాలి. అంతవరకే దేహము, మనస్సు యొక్క ప్రయోజనం. స్వరూపజ్ఞానాన్ని సంపాదించటానికి నీ దేహాన్ని, మనస్సుని ఎంతవరకూ ఉపయోగించుకొంటున్నావో ఆ టైము ఒక్కటే ముఖ్యం. స్వరూపజ్ఞానం తప్పించి మిగతావి కూడా నువ్వు సాధించవచ్చు. సాధించినా అవన్నీ స్వప్న సమానం, ఒకటి లేని సున్నలు. మనం తినే ఆహారం వలనే శరీరం తయారవుతుంది, మనస్సు తయారవుతుంది. మన ఆరోగ్యం నిలబడాలంటే రుచికోసం ఏదీ తినకూడదు, ఆరోగ్యం కోసం తినాలి. ఎంతరుచిగా ఉన్నా అది ఆరోగ్యం చెడగొట్టేస్తుంది అంటే అది మానేయాలి. ఆహారవిషయంలో, మాట్లాడే మాటలవిషయంలో, నిద్రవిషయంలో మనం నియమబద్ధంగా ఉండాలి. దేహం అనారోగ్యంగా ఉన్నా, మనస్సులో అశాంతి ఉన్నా హృదయంలో మనస్సు నిలబడదు. మనస్సు అంటే ఏమీ లేదు. మనకు వచ్చే సంకల్పాలు, వికల్పాలు, ఇష్టాలు, అయిష్టాలు, కామక్రోధాలు దీనినే మనస్సు అని పిలుస్తారు. బయట అంటూ ఏమీలేదు, అంతా నీలోపలే ఉంది. నీకు ఉన్న కోరికల వల్ల, వాసనల వల్ల, అలవాట్ల వల్ల బయట ఏదో ఉంది అనుకుంటున్నావు. నువ్వు అలవాట్ల యొక్క వేగం తగ్గించుకుంటే నీకు మానసికఆరోగ్యం, శారీరకఆరోగ్యం కూడా బాగుపడుతుంది. నీకు భోగప్రవృత్తి తగ్గుతుంది. మనిషి పాడైపోవటానికి భోగప్రవృత్తే కారణం.

ఎవరూ ఎవరికీ ఏమీ కారు. ఇది మనం గుర్తుపెట్టుకోవాలి. ఇంట్లోవాళ్ళకి మనం డ్యూటీ చేయాలి కాని వారు ఏదో మనల్ని ఉద్ధరిస్తారని అనుకోకూడదు. వారిపట్ల మమకారం పెట్టుకోకూడదు. వాళ్ళు అభివృద్ధిలోకి రావటం, రాకపోవటం అనేది వాళ్ళ దేహప్రారబ్ధాన్ని బట్టి ఉంటుంది. దేహప్రారబ్ధానికీ, నీకు సంబంధం ఏమిటి? పుట్టిన వస్తువు ప్రారబ్ధం అనుభవిస్తుంది. పుట్టని దానికి ప్రారబ్ధం ఏమిటి? నువ్వు పుట్టిన వస్తువు కాదు. నువ్వు పుట్టని వస్తువు. నువ్వు సాధన చేస్తే పుట్టని వస్తువు నీకు అనుభవంలోకి వస్తుంది. అప్పుడు దేహాన్ని ప్రారబ్ధానికి వదిలేస్తావు. నువ్వు శాంతిగా, సుఖంగా ఉంటావు. మనకి జ్ఞాననేత్రం ప్రసాదించటానికి అనేకమంది మహర్షులు, యోగులు ఈ భూమిమీదకి వచ్చారు. నువ్వు ఎంత చెడ్డ ప్రారబ్ధం అనుభవిస్తున్నప్పటికీ, ప్రపంచంలో ఎవరికీ లేని దుఃఖం నీకు వచ్చినప్పటికీ, ఆ దుఖంః నిన్ను బాధపెట్టకుండా అందులోంచి ఎలా విడుదల పొందాలో ఆ రకమైన టీచింగు ఒక భగవాన్ బోధలో మాత్రమే ఉంది. అది భగవాన్ టీచింగు యొక్క వైభవం.

నేను ఆత్మభావన నిలబెట్టుకోవటానికి కష్టపడి సాధన చేసుకుంటూ ఉంటే మనస్సు దేహభావనలోకి వచ్చేస్తుంది. ఆత్మభావనలో నిలబడటం లేదు అని ఒకరు అడిగారు. శరీరానికి రోగనిరోధకశక్తి ఎక్కువ ఉంటే మందులతోటి సంబంధం లేకుండా వచ్చిన రోగాన్ని బయటికి పంపేయగలదు. మీరు చేస్తున్న సాధన సరిపోదు. మీకు దేహభావనకి సంబంధించిన బలం ఎక్కువ ఉంది. మీరు ఆత్మభావనలో తాత్కాలికంగా అప్పుడప్పుడూ నిలబడినా అది సరిపోదు. వారు కాశీ వెళ్ళి తపస్సు చేశారు, వీరు హిమాలయాలు వెళ్ళి తపస్సు చేశారు అంటారు. వాటి ప్రయోజనం ఏమిటీ నువ్వు ఎక్కడికి వెళ్ళి తపస్సు చేసినా దేహాత్మబుద్ధి నశించాలి. నీ మనస్సులో ఉన్న అలవాట్లని ఎండింపచేయటమే తపస్సు. దేహబుద్ధి నశింపచేయటం చాలాకష్టం. మీరు ఇంటి దగ్గర ఒంటరిగా కూర్చోండి. మీకు మంచి తలంపులో, చెడ్డతలంపులో వస్తూంటాయి. ఈ తలంపు ఎందుకు వస్తోంది? కారణం ఎవరు అని చూడండి. మీ దేహమే కారణం అవుతుంది. ఈ దేహమే నేను అనుకుంటున్నారు కదా! మొత్తం అన్ని తలంపులూ దేహబుద్ధిలోంచే వస్తాయి. లోపల వాసనని బట్టి తలంపు వస్తుంది. వాసన ఎలా వస్తుంది. నువ్వు కర్మ చేస్తే ఫలితం వస్తుంది. ఆ ఫలితాన్ని నువ్వు అనుభవిస్తావు. అనుభవిస్తే మళ్ళీ వాసన పడుతుంది. ఆ వాసన అదే పని మిమ్మల్ని చేయమని మళ్ళీ పురికొల్పుతూ ఉంటుంది. ఇది విషవృక్షం. దేహబుద్ధి దాటినవాడు దీనిని అతిక్రమించ గలడు కాని దేహబుద్ధిలో ఉన్నంతసేపు ఈ విషవృక్షంలోంచి బయటకు రాలేడు. మనం చనిపోయే దేహమా? అంటే కాదు. చనిపోని ఆత్మే మనం. కానీ మనం దేహాన్ని ఆత్మ అనుకుంటున్నాం అంటే మనకి ఆత్మయందు దేహబుద్ధి వస్తోంది. దేహం చనిపోయినప్పుడు మీరు నేను చనిపోతున్నాను అనుకుంటారు. దేహం చనిపోతుంది అనుకుంటే ఫరవాలేదు. మీరు చావులేని సద్వస్తువు, చనిపోయేది మీరు కాదు. మీ శరీరం ఈ భూమిమీద తిరుగాడుతుండగానే ఆ చావులేని సద్వస్తువుని మీరు సాధించాలి. మోక్షసుఖం మీరు అనుభవించాలంటే శరీరం చనిపోయే వరకూ ఆగక్కరలేదు. ఈ భూమిమీద ఉండగానే ఆత్మసుఖం పొందవచ్చు. అది అనుభవంలోనికి వచ్చాక మీకు దేవుడు కనిపిస్తే ఆయనను చూడాలని అనిపించదు. మీకు వైకుంఠానికి వెళ్ళాలి, కైలాసానికి వెళ్ళాలి అనే తలంపే రాదు. అంటే ఇష్టంలేక కాదు, వాటి అవసరం మీకు లేదు.

బుద్ధుడు, రమణమహర్షిగారు వచ్చాక సాధన పేరుమీద ఖర్చులు ఏమీ అక్కరలేదు అని ఖర్చులు తగ్గించేశారు. అది వారు లోకానికి చేసిన ఉపకారం. యజ్ఞాలు, యాగాలు అని, ఆ దేవతలని సంతృప్తి పరచండి అని ఇలా కొంతమంది ఖర్చులు పెంచేశారు. ఆ రకమైన ఖర్చులని తగ్గించి సాధనా భాగాన్ని పెంచి, మీకు బయట చూపు తగ్గించి లోచూపు కలుగచేసినవారు బుద్ధుడు, రమణుడు. ఆత్మజ్ఞానం కోసం ఏదో ఖర్చు పెట్టాలి. ఏదో ఖర్చు పెట్టకపోతే రాదు అనే బుద్ధిని పోగొట్టారు, ఆ పాడుబుద్ధి మీకు లేకుండా చేశారు.

రమణమహర్షిగారు ఒక పదినిమిషాల టైములో ఋషి అయిపోయారు. ఆయన మరణానుభవం ద్వారా మృత్యువును జయించారు. ఆ క్షణంతోటి ఆయనకు మరణభయం పోయింది. ఆ అనుభవం మీకు రావాలంటే మీ తెలివితేటలు సరిపోవు, మీ ప్రయత్నం సరిపోదు, మీ అధ్యయనాలు సరిపోవు. ఈశ్వరానుగ్రహం లేకుండా, గురువు అనుగ్రహం లేకుండా అది సాధ్యము కాదు. ఉన్నది ఈశ్వరుడే, అసలు మనం లేము. మనం ఉన్నాము అనుకుంటున్నాం. మనం అనుకున్నా ఆయన సంకల్పమే, అనుకోకపోయినా ఆయన సంకల్పమే జరుగుతుంది. మీ శరీరం ఈ భూమిమీదకి ఏపని మీద వచ్చిందో మీకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా ఆ పని జరిగిపోతుంది. అర్జునా యుద్ధం చెయ్యటానికి, చెయ్యక పోవటానికి నువ్వు ఎవడవు? అందరూ యుద్ధాలు చేస్తారా? నువ్వు యుద్ధం చెయ్యటానికి వచ్చావు. నీ సంకల్పంతో, నీకోరికతో సంబంధం లేకుండా నీ దేహం ద్వారా ఏది జరగాలో అది జరిగిపోతుంది. నీ శరీరం ఎందుకు వచ్చిందో ఆ శరీరం ద్వారా ఆ పని జరిగిపోయిన తరువాత అది చనిపోతుంది. మన చేతిలో ఉన్న పనిముట్టును మనం ఇష్టం వచ్చినట్లు వాడుకుంటాం కదా. అలాగే మనం ఈశ్వరుడి చేతిలో పనిముట్లం. ఆయన ఒకో శరీరాన్ని దానిప్రారబ్ధాన్ని బట్టి ఒకోరకంగా వాడుకుంటున్నాడు. అసలు ఉన్నది ఆయనే మనం ఏమనుకుంటున్నాం. అంటే ఆయనా ఉన్నాడు, మనమూ ఉన్నాము అనుకుంటున్నాం. కానీ ఆయన ఉన్నాడు మనం లేము అనే అనుభవం మనకి వచ్చేవరకూ మనల్ని మాయ వెంటాడుతుంది. ఏ వస్తువుని అయితే నువ్వు పొందుదాము అనుకుంటాన్నావో దాని అనుగ్రహంలేకుండా, దాని దయలేకుండా దానిని నువ్వు పొందలేవు. ఇది జ్ఞాపకం పెట్టుకోండి.

మనం ఎక్కడికో కాశీ పారిపోవటంకాదు. మనం మాట్లాడే మాటలో, మనకి వచ్చే ఆలోచనలో అహంభావన ఉండకూడదు. అది చూచుకుంటే చాలు. మీకు దేహబుద్ధి నెమ్మదిగా పోతుంది. మీరు ఎక్కడికి వెళ్ళినా ప్రపంచం ఉంది, ఎక్కడికి వెళ్ళినా పంచభూతాలు ఉన్నాయి, ఎక్కడికి వెళ్ళినా మనుషులు ఉన్నారు, రాగద్వేషాలు ఉన్నాయి. అందుచేత నీకు భగవంతుడు కేటాయించిన పనిని నిరహంకారంగా, నిరభిమానంగా చేసుకుంటూపోతే నీకు నెమ్మదిగా దేహబుద్ధి తగ్గిపోతుంది. నువ్వు పని చేస్తున్నావు. ఆపని దేనికోసం చేస్తున్నావు? గౌరవం కోసం చేస్తున్నావా? పనిపనికోసం చేస్తున్నావా? నువ్వు గుర్తింపుల కోసం ఆ పని చేస్తూఉంటే గుర్తింపులు వస్తాయి. అసలు సున్న. ఈశ్వరుడు నిన్ను అనుగ్రహించడు. ఈశ్వరుడు సర్వసాక్షి. నువ్వు మనుషుల్ని మోసం చెయ్యగలవు కాని, ఈశ్వరుడిని మోసం చెయ్యలేవు. ఎందుచేతనంటే నీలో ఉన్న వాసన తలంపు రూపంలో వచ్చిన తరువాత నీకు తెలుస్తుంది కానీ అది తలంపులోకి రాకముందే నీకు వాసన రూపంలో నీ హృదయంలో ఏముందో ఈశ్వరుడికి తెలుసు. వాడు ఈశ్వరుడు. అందుచేత మనం దైనందిన జీవితంలో జాగ్రత్తగా దేహబుద్ధి తగ్గించుకుంటూ ఉండాలి. నీకు ఆలోచన వస్తోంది.

నీకు ఆ ఆలోచన సమాజంలో గుర్తింపుకోసమా లేకపోతే ఈశ్వరానుగ్రహం కోసమా? తలంపు నీకు ఎందుకు వస్తోంది? అని నిరంతరం మనం వాచింగులో ఉండాలి. పుట్టలో పాము ఉందనుకోండి. ఆ పుట్ట దగ్గర మీరు కూర్చున్నారనుకోండి, పాము పుట్టలోంచి బయటకు వచ్చి చూచి, అక్కడ మనుషులు ఎవరైనా ఉంటే మళ్లీ లోపలికి వెళ్లిపోతుంది. అలాగే మీరు హృదయంలో వాచింగులో ఉంటే తలంపు పుడుతుంది, అణిగిపోతూ ఉంటుంది. మరల తలంపు పుట్టి అణిగిపోతూ ఉంటుంది. ఆ తలంపు మీకు యాక్షన్‌లోకి రాదు. అప్పుడు వాసన బలహీనపడి చచ్చిపోతుంది. ఎందుచేతనంటే వాసనకి ఫుడ్‌సప్లై తగ్గిపోతుంది.

ఈ మధ్యన అందరూ కుటుంబనియంత్రణ గురించి మాట్లాడుతున్నారు మమ్మల్ని ఏంచేయమంటారు అని ఒకరు భగవాన్‌ని అడిగారు. కుటుంబనియంత్రణ గురించి ఆలోచించేవాడవు మరి మరణనియంత్రణ గురించి నువ్వు ఎందుకు ఆలోచించటం లేదు అది కూడా ఆలోచించు అన్నారు భగవాన్. నీకు పిల్లలు పుట్టకుండా ఆపు చేసుకుంటున్నావు చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అనుకుంటున్నావు కదా. ఆ భయంలోంచి, ఆ తలంపులోంచి ఎలా బయటపడాలి అని నువ్వేమీ ఆలోచించటంలేదు. నువ్వు మళ్లీ పుట్టకూడదు. నువ్వు పుట్టకుండా నిన్ను ఎవడు ఆపు చేస్తాడు. అది కూడా ఏదైనా హాస్పటల్‌లో ఆపరేషన్ చేస్తున్నారా? ఎవరైనా చేసేవాళ్ళు ఉంటే ఆపరేషన్ చేయించుకో అన్నారు. సన్యాసం అంటే బట్టలు మార్చుకోవటం కాదు. లేకపోతే మీ కుటుంబంతోటి ఉన్న అనుబంధాలు విడిచిపెట్టేసి పారిపోవటంకాదు. నీకు జ్ఞానం రాకుండా వాళ్ళు ఏమీ అడ్డుపడటంలేదు. వాళ్ళు అడ్డు వచ్చేస్తున్నారని నువ్వు అనుకొంటున్నావు. అసలు సంసారం అంటే నీకు ఉన్న తలంపులే సంసారం, మనస్సే సంసారం, దేహబుద్ధే సంసారం అంతేకాని ఇంట్లోఉన్న మనుష్యులు సంసారం కాదు. మనం గుఱ్ఱాన్ని నీళ్ళ దగ్గరకి తోలుకెళ్ళవచ్చు కానీ దానిచేత నీళ్ళు తాగించలేము. అలాగే మీ కుటుంబసభ్యులు అభివృద్ధిలోనికి రావటానికి మీరు అవకాశాలు ఇవ్వవచ్చు కానీ వాడు అభివృద్ధిలోనికి రావచ్చు, రాకపోవచ్చు. అది మీకు సంబంధంలేదు. అవకాశాలు మీరు ఇవ్వండి. అది ఉపయోగించు కుంటే అభివృద్ధిలోకి వస్తారు. ఉపయోగించుకోకపోతే అభివృద్ధిలోనికి రారు. వాళ్ళ మీద మమకారం పెంచుకోవద్దు. నీ మనస్సులో ఉన్న మమకారాన్ని విడిచిపెట్టటమే సన్యాసం. అసలు మమకారం అంటూ లేకపోతే మనిషి ఏ తప్పు చేయనక్కరలేదు అని భగవాన్ చెప్పారు. మనిషికి అది తప్పు అని తెలిసినా తప్పు ఎందుకు చేస్తున్నాడు అని అర్జునుడు అడిగాడు. కోరిక వలన అని పరమాత్మ చెప్పాడు. భగవాన్ ఏమంటున్నారు అంటే అసలు నీకు కోరిక ఎందుకు వస్తోంది. మమకారాన్ని బట్టి వస్తోంది. నీకు మమకారం లేకపోతే నీ మనస్సును కదలమంటే కదలదు. మనస్సుని నిలబెట్టటానికి యోగాభ్యాసాలు అక్కరలేదు, ప్రాణాయామాలు అక్కరలేదు. ఇవన్నీ కల్పించి తెచ్చుకుంటున్నారు. నీకు రోగం వస్తే మందులు కాని అసలు రోగమే రాకపోతే మందులు ఎందుకు. ప్రపంచంలో పాపం అంటూ ఎక్కడా ఏమీలేదు.

ఒకవేళ నీకు పాపం ఉన్నట్టు కనిపిస్తూఉంటే అది మమకారం అని భగవాన్ చెప్పారు. నువ్వు ఏదైనా తప్పు చేశావనుకో, ఎక్కడో నీకు మమకారం ఉంది. మమకారం లేకుండా నీకు తప్పు చేయవలసిన పనిలేదు. మమకారం లేకుండా నువ్వు అసలు పొరపాటు చెయ్యవు అన్నారు. నువ్వు మమకారం కనుక విడిచిపెట్టేస్తే నీటిలో ఉప్పు ఎలా కరిగిపోతుందో అలా ప్రపంచం అంతా మీరు అయిపోతారు. మమకారం ఉంటే దూడని కట్రాడికి కట్టేసినట్టు ఒకచోటే ఉంటారు. మమకారం పోతే ప్రపంచం అంతా మీదే. ఇది నాది, ఇది నాదికాదు అని ఏమీలేదు. ఒకచోట ఉన్నాము, ఇంకోచోటలేము అనే ఫీలింగు కూడా మీకు రాదు. ఎవడికయితే మమకారం పోయిందో వాడి ప్రేమ ప్రపంచం అంతా వ్యాపిస్తుంది. వాడికి భేదబుద్ధి నశిస్తుంది.

మీరు నిద్రపోతారా అని ఒకరు భగవాన్‌ని అడిగారు. మెలుకువగా ఉన్నవాడు నిద్రపోతాడు, నిద్రపోయేవాడు మేల్కొంటాడు. మనకి ఆ రెండింటి గొడవ లేదు అన్నారు. నేను నిద్రపోను అని చెప్పలేదు ఆయన. ఆత్మకి నిద్ర, మెలకువ ఉన్నాయా, అది సుప్రీంస్టేట్. అది మనకు అనుభవంలోకి వచ్చేవరకూ ఆ స్టేట్ మనకి అర్థంకాదు. భగవాన్‌కి అరుణాచలం నుంచి కదిలి ఇంకోచోటికి వెళ్ళాలనే తలంపు కూడా రాలేదు. జ్ఞానికి చూడటానికి ఏమీలేదు, వినటానికి ఏమీలేదు. ఎక్కడికి వెళ్ళినా వాడికి వాడే కనిపిస్తాడు. మీరు అప్పుడప్పుడూ ఆ కొండ వంక చూస్తూ ఉంటారు కదా అని భగవాన్‌ని అడిగితే, కొండవంక చూస్తే నన్ను నేను చూసుకుంటాను అన్నారు. పురాణాలలో పుణ్యం చేసుకున్న వాళ్ళందరూ వైకుంఠం వెడతారని, కైలాసం వెడతారని చెబుతున్నారు కదా! అందుకే ఇక్కడ పుణ్యం చేస్తున్నారు. అయితే ఆ పురాణాలన్నీ అబద్ధాలా అని భగవాన్‌ని అడిగితే, భగవాన్ ఆ లోకాలు లేవని చెప్పలేదు. ఏమన్నారంటే శరీరం చనిపోయాక ఆ లోకాలకి వెళ్ళేవాడు ఒకడు ఉన్నాడు కదా! ఆలోకాలకి వెళ్ళేవాడు ఎంతనిజమో, ఆలోకాలు కూడా అంతే నిజం అన్నారు. అంటే వెళ్ళేవాడు అబద్ధం, అవీ అబద్ధం అని చెప్పటం. ఒక ట్రూత్‌రియలైజేషన్ తప్పించి ప్రతీదీ డ్రీమే అన్నారు. నీకు తెలుసున్న విషయాలలోంచి, నీకు తెలియని విషయాలలోంచి, ఈ బంధాలు ఈ గొడవలలోంచి నిన్ను విడుదల చేసేది నీ హృదయంలో ఉన్న ట్రూత్ ఒక్కటే. ఈ లోకాలు ఆ లోకాలు ఏవీ నిన్ను విడుదల చేయలేవు. భక్తియోగం, కర్మయోగం, జ్ఞానయోగం ఇవన్నీ చెపుతారు కాని అసలు అర్థం చేసుకోవటం కంటే మించిన యోగంలేదు. మీరు సబ్జక్టుని ఉన్నది ఉన్నట్టు అర్థంచేసుకోవటం కంటే మించిన యోగం లేదు. అండర్‌స్టాండింగ్ ఇట్ సెల్ఫ్ ఈజ్ యోగ. మీకు సబ్జక్టు అర్థమవుతూ ఉంటే ఇప్పుడే, ఇక్కడే మోక్షసుఖాన్ని పొందుతారు.

సముద్రంలో ఎంతనీరు ఉందో మీ హృదయంలో అంత సుఖం, శాంతి ఉన్నాయి. ప్రపంచంలో అందరూ నీకు శత్రువులు అవ్వవచ్చు, కానీ నీకు శత్రువులు ఎంతమంది ఉన్నా నీ హృదయంలో ఉన్న శాంతి, ఆనందం పొంగి నీ శిరస్సుని ముంచేస్తూ ఉంటే అప్పుడు శాంతి కోసం నీ శరీరం మీద కాని, ప్రపంచం మీద కాని, దేవతల మీద కాని ఎవ్వరి మీదా

నువ్వు ఆధారపడక్కరలేదు. నీ హృదయంలో ఉన్న శాంతి నీకు అనుభవంలోకి వచ్చినప్పుడు దేవుడు వచ్చి కనిపించినా నీకు చూడాలనిపించదు. ఇష్టంలేకకాదు, ఇంక అవసరం లేక. అటువంటి ఆనంద సముద్రంలో నువ్వు మునగటం మానేసి, ఆ హృదయంలోకి ప్రయాణం చెయ్యటం మానేసి ఎక్కడో ఏదో ఉంది, ఎక్కడో ఏదో చూస్తాను అని తిరుగుతున్నావు. ఇది ఒక మాయ. ఏదైతే లేదో దానిని ఉంది అనుకోవటం మాయ. పాముకి తొందరపాటు ఎక్కువ, కాకికి శుభ్రత తక్కువ. మీరు కాకిలాగ, పాములాగ ఉండకండి అన్నారు.

రమణమహర్షిగారు ఇంటిదగ్గర చెప్పకుండా అరుణాచలం వచ్చారు. ఆయన ఇంటిదగ్గర కోపం మీద అరుణాచలం వచ్చారా, కోపంమీద రాలేదు. ఎవరిమీదైనా ద్వేషం మీద వచ్చారా, ద్వేషంమీద రాలేదు. ఆయన టీచింగుకి అరుణాచలాన్ని సెంటర్‌గా ఈశ్వరుడు ఎన్నుకున్నాడు. ఆయన అరుణాచలం వచ్చి ఈశ్వరుడితో ఏమని చెప్పారంటే నా అంతట నేను రాలేదు, నువ్వురమ్మంటే నేను వచ్చాను. ఈ దేహాన్ని నీకు నివేదిస్తున్నాను అన్నారు. బుద్ధుడు, రమణుడు ఇంటిని నార్మల్‌గా, నేచురల్‌గా విడిచిపెట్టారు. మళ్ళీ వాళ్ళు వెనక్కి తిరిగి చూడలేదు. వాళ్ళు ఒక మెసేజ్ ఇవ్వటానికి లోకంలోకి వచ్చారు. భగవాన్ అరుణాచలం వచ్చిన కొత్తలో ఎక్కువ మౌనంగానే ఉండేవారు. మౌనం కూడా మాట్లాడుతుంది. మౌనభాష ఎవరికైతే అర్థమవ్వటంలేదో వాళ్ళకోసం మాట్లాడుతున్నాను అని భగవాన్ చెప్పారు. నీతో మాట్లాడే పని నాకు ఏమీలేదు అన్నారు రంగన్నతో భగవాన్. నాతో మాట్లాడేపనిలేదు అంటున్నావు కదా! మరి ఇప్పుడు నాతో ఎందుకు మాట్లాడుతున్నావు అని రంగన్ అడిగాడు. అవుటాఫ్‌లవ్, అవుటాఫ్‌గ్రేస్, అవుటాఫ్‌మెర్సీ ఇంకో కారణం లేదు అన్నారు. మీ మనస్సుని అలంకరించేవాళ్ళు ఎవరూలేరు అనుకోండి. ఇంక మీ మనస్సుని మీరే అలంకరించు కుంటారు. ఇప్పుడు ప్రత్యేకంగా మనమేమీ కష్టపడక్కరలేదు. మన మనస్సుని డెకరేట్ చేయటం మానేస్తే సరిపోతుంది. ఇదే నిజమైన సాధన. దేహప్రారబ్ధాన్ని బట్టి పరిస్థితులు ఒకోసారి అనుకూలంగా ఉంటాయి. ఒకోసారి ప్రతికూలంగా ఉంటాయి. ఒకోసారి మన చేతినిండా డబ్బు ఉంటుంది. ఒకోసారి మనచేతిలో డబ్బు ఉండదు. ఒకోసారి మన శత్రువులు కూడా మిత్రులు అవుతారు. మన మిత్రులు కూడా శత్రువులు అవుతూఉంటారు. కాలగర్భంలో ఏముందో మనకు తెలియదు. కానీ నీ హృదయంలో ఉన్న శాంతి మేల్కొన్నప్పుడు నీకు ఈ సమస్యలన్నీ సమస్యలే కాదు. ప్రపంచంలో ఉన్న మూడు కోట్లమంది జనం నీకు శత్రువులు అయినా నీకు ఎఱ్ఱచీమ కుట్టినట్టు ఉండదు. అదీ ఆత్మానందం.

నువ్వు ఇంట్లో ఉన్నా, బయటికి పారిపోయినా, అడవిలో ఉన్నా దేహభావనని అతిక్రమించాలి. పరిసరాలు మారినంతమాత్రంచేత దేహభావన పోతుంది అని ఎక్కడా లేదు. అది నువ్వు కష్టపడి కృషిచేసి పోగొట్టుకోవాలి. అరుణాచలం వెడితే కొండ కనిపిస్తుంది. కాశీ వెడితే గంగానది కనిపిస్తుంది. పరిసరాలు మారతాయి. అంతేకాని దేహబుద్ధిని

నువ్వు సాధనచేసి పోగొట్టుకోవలసిందే. దానికి గురువు అనుగ్రహం ఉండాలి. మీ వల్ల మాకు మోక్షం వచ్చేస్తుంది అని భగవాన్‌ని అడిగితే, ఆయన అనేవారు మీకు ఏమో నావల్ల మోక్షం వస్తుంది అంటున్నారు, మరి నాకెలా వచ్చింది? మోక్షం ఇవ్వటానికి ఇంతమంది ఉన్నారా? ఉన్నవాడు ఒక్కడే. ఎవడైతే నాకు శాంతిని ప్రసాదించాడో వాడే మీకుకూడా శాంతిని ఇస్తాడు అన్నారు. 'నేను' అనేది ఆయనకు వాడకంలో ఉండదు.

మీ ప్రోపర్టీమీద కాని, మీ ఇంట్లో ఉన్న మనుష్యుల మీద కాని, బయట సమాజం మీద కాని, మీకున్న అవకాశాలమీదకాని, దేనిమీద అయినా మీ శాంతి, సుఖం ఆధారపడి ఉన్నాయి అనుకోండి, ఆ శాంతి, సుఖం ఎప్పటికైనా దుఃఖం కింద మారిపోతుంది. అది భగవంతుడి చట్టం. అది జ్ఞాపకం ఉంచుకోండి. మీరు ఇతరుల మీద ఆధారపడింది ఏదీ నిలబడదు. మీ ఇంట్లో వ్యక్తుల పట్ల మీ డ్యూటీ చేయవద్దని నేను చెప్పటం లేదు. కానీ ఎక్కడైనా సరే మీ హేపీనెస్ కోసం వాళ్ళమీద ఆధారపడితే రెట్టింపుకి రెట్టింపు అంతా దుఃఖం కింద మారిపోతుంది. ఉండటం అనేది ఎండ్‌లెస్ హేపీనెస్. దానికి ముగింపు ఉండదు. మనం ఏదైనా భోగాలు అనుభవిస్తున్నాము అనుకోండి, దానికి ముగింపు ఉంటుంది. ముగింపు అయిన తరువాత మళ్ళీ పెయిన్ ప్రారంభమవుతుంది. కానీ ఎండ్‌లెస్‌హేపీనెస్ నువ్వు ఎంజాయ్ చేసేకొలదీ ఫ్రెష్‌గా ఇప్పుడే కొత్తగా ఎంజాయ్‌మెంట్‌లోకి వచ్చింది అనిపిస్తుంది. నీకు లోపల నుంచి వచ్చే హేపీనెస్ ఎలా ఉంటుంది అంటే అది ఏక్షణానికి ఆక్షణమే కొత్తగా అనుభవిస్తున్నామా అనిపిస్తుంది. అది అంత ఫ్రెష్‌గా ఉంటుంది. అది డిపెండెంట్ కాదు. అది ఇండిపెండెంట్ హేపీనెస్. మీకు సబ్జెక్టు ఎందుకు చెబుతున్నానంటే ఒకవేళ మీ దేహప్రారబ్ధం బాగోలేదు అనుకోండి, మీకు ఇంటిదగ్గర పరిస్థితులు బాగా లేదు అనుకోండి, ఎటుచూచినా మీకు శత్రువులే అనుకోండి, అయినా మీకు సబ్జక్టు ఉన్నది ఉన్నట్టు ప్రోపర్ అండర్‌స్టాండింగ్ కనుక మీకు వస్తే ఇప్పుడే ఈ క్షణమే మీరు ఈ హాలు విడిచిపెట్టి బయటకి వెళ్ళకుండా మీ దుఃఖం అంతా ఆనందంగా మారిపోతుంది. ప్రారబ్ధం ఎవరికి, ప్రారబ్ధం దేహానికి. దేహం ప్రారబ్ధం అనుభవిస్తుంది. ఆ దేహం మీరు కాదు కదా. మరి కంగారు ఎందుకు పుడుతోంది? మీకు ఆ దేహంతోటి ఉన్న తాదాత్మ్యం వలన ఇది అంతా వస్తోంది. మనకు ఉన్న దేహం పట్ల ఆత్మబుద్ధిని, దేహంపట్ల సత్యబుద్ధిని, దేహం ఉంటే ఉంటాం దేహంతోటే పోతాం అనేటువంటి మిథ్యాబుద్ధిని తొలగించటానికే అవతారపురుషులు అయినా, ప్రవక్తలు అయినా, జ్ఞానులు అయినా ఈ లోకం మీద అవతరించింది, వాళ్ళకి సొంతపనులు అంటూ ఏమీ లేవు.

మనిషి సబ్జక్టు అర్థం చేసుకోవటం ఎందుకు కష్టం అంటే దానికి స్వార్థం కారణం. ప్రతీ మనిషి సెల్ఫ్ సెంటర్డ్. స్వార్థం వలన వాడికి సబ్జక్టు ప్రోపర్‌గా అందదు. మీరు సబ్జక్టు అర్థం చేసుకొనేకొలదీ సాధన పేరు మీద మీకు కష్టం తగ్గిపోతుంది. మీకు సబ్జక్టు ప్రోపర్‌గా అర్థమవుతూ ఉంటే మీకు తెలియకుండా ఆ సాధన చేసేవాడు జారిపోతాడు. ఇంక ఎవరితోటి

సాధన చేస్తారు. సాధకుడు ఉంటే సాధన చేస్తాం. వాడు పత్తాలేకుండా వెళ్ళిపోతాడు అనుకోండి మీరు ఇంక సాధన ఏమి చేస్తారు. తుకారామ్ ఏమన్నాడు అంటే ఒకప్పుడు నాకు దేహగతమైన నేను ఉన్నమాట నిజమే. కాని దానిని పోగొట్టుకోవటానికి నేను ఎప్పుడూ ప్రయత్నం చేయలేదు. పాండురంగడి పట్ల ఆయనకి ఉన్న భక్తిలో అది ఎప్పుడు కరిగిపోయిందో కరిగిపోయింది. అది ఆయనకి తెలియదు. ఇప్పుడు ప్రత్యేకంగా దానిని పోగొట్టుకోవటానికి అది లేదు. అది పోయింది అన్నాడు తుకారామ్. రామకృష్ణుడిని ఒక పండితుడు అడిగాడు మీరు శాస్త్రాలు చదువుకున్నారా అని. శాస్త్రాలు చదువుకోవటానికి నాకు చదువు రాదు అన్నాడు. పోనీ విన్నారా అని అడిగాడు. పండితులు చదివి వినిపిస్తూ ఉంటే వింటున్నాను అని చెప్పాడు. శాస్త్రాలలో శరీరం నేను అనే తలంపుని ఎలా పోగొట్టుకోవాలో చెప్పారు అది ఎప్పుడైనా విన్నారా అని అడిగాడు. అవన్నీ విన్నాను అన్నాడు రామకృష్ణుడు. మీరు ఆ నేనును పోగొట్టుకున్నారా అని పండితుడు అడిగాడు. నేను శ్రవణం చేసాను, శ్రవణం చేసింది మననం చేసి ఆ నేను కోసం వెదుకుతున్నాను. ఎంతకాలం వెదకినా అది నాకు కనపడటం లేదు. ఉంటే దానిని పట్టుకొని పోగొట్టుకుందును అది కనిపించకపోతే నేనేం చేస్తాను అన్నారు. అంటే ఆయనకి దేహగతమైన నేను లేదు. ఆ ఒక్క వాక్యాన్ని బట్టి ఆయన అవతార పురుషుడు అని మనకి తెలుస్తుంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-08-2012, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

అమృతత్వం అంటే మన శరీరం చనిపోయేటప్పుడు ఈ శరీరం పోతోంది, శరీరం పోయినా కాని మనం ఉంటాము అనే అనుభవం మనకు రావాలి. ఆ ఉండటం అనే అనుభవం మీకు ముందుగా వస్తే మంచిదే లేకపోతే ప్రాణం పోయే రోజున అయినా రావాలి. దానినే అమృతత్వం అంటారు, అదే మన జీవితగమ్యం. మీ దేహప్రారబ్ధం ఎలా ఉన్నప్పటికీ అది మంచిగా ఉన్నా, చెడ్డగా ఉన్నా అంతా స్వప్నమే. ప్రారబ్ధం అనుభవంలోనికి రావటానికే ఈ శరీరం వచ్చింది లేకపోతే మనకు శరీరంతో పనిలేదు. మరణానుభవం ద్వారా మరణం లేని స్థితిని భగవాన్ మధురైలో ఇంటి దగ్గరే పొందారు, అంటే అమృతత్వం పొందారు. దేహం చనిపోయింది, ఈ దేహాన్ని తీసుకొని వెళ్ళి స్మశానంలో దహనం చేస్తారు, మరి దహనం చేసినప్పుడు మనం కూడా పోవాలికదా, మనం ఉన్నట్లు మనకి తెలుస్తోంది కదా అనే అనుభవం ఆయనకు వచ్చింది. ఆరోజు మొదలు ప్రపంచంలో ఏ వస్తువును చూసినా ఆయనకు భయం పోయింది. అంటే ఆ శరీరం తాను కాదని ఆయనకు అర్థమయ్యింది. శరీరం తానుకాదని తెలిసినప్పుడు ఇంక భయం పోయింది. సింహం, పులి, పాము ఇలా ఏ జంతువులు కనిపించినా అది ప్రక్కకి తప్పకోవలసిందే కాని ఆయన ఎక్కడా ప్రక్కకి తప్పకోలేదు అంటే అసలు మరణం పట్ల భయంపోయింది, ఉన్నది ఈశ్వరుడే, మనం లేము

అనే విషయం ఆయనకు అనుభవంలోనికి వచ్చింది.

గ్రౌండ్ రియాలిటీస్ విడిచిపెట్టవద్దు, గ్రౌండ్ రియాలిటీస్ తెలియకపోవటం వలన, వాటికి దూరంగా జీవించటం వలన మీరు పతనమవుతారు అని చెపుతున్నాను. గ్రౌండ్ రియాలిటీస్ అంటే వాస్తవపరిస్థితులు. మనం వాస్తవపరిస్థితులకు దూరంగా జీవించకూడదు. అంటే మీకు పది ఎకరాలు పొలం ఉంటే ఎనిమిది ఎకరాల మీద వచ్చే ఆదాయంతో సరిపెట్టుకొని కనీసం రెండు ఎకరాల పంట అయినా జాగ్రత్త పెట్టుకోవాలి. అంతేకాని మీకు పది ఎకరాలు ఉంటే వంద ఎకరాలు ఉన్నవాడు ఎలా ఖర్చుపెడతాడో అలా ఖర్చు పెడితే మీకు గ్రౌండ్‌రియాలిటీస్ తెలియదు అని అర్థం. అంటే మీకు వచ్చే ఆదాయం ఎంత, మనం ఎంత ఖర్చుపెడుతున్నాము అనేది చూచుకోవాలి. ఆదాయం తక్కువగా ఉండి, ఖర్చు ఎక్కువైతే సంసారం ఏమౌతుంది? ఇలా ఎక్కువ ఖర్చులకు అలవాటు పడితే డబ్బు పాడైపోవటమేకాదు, మనస్సు పాడైపోతుంది. అవసరం లేని ఖర్చులు పెడుతూ కొన్ని అలవాట్లు నేర్చుకుంటే శరీరం చనిపోయాక ఈ అలవాట్లు అన్నీ మన కూడా వచ్చేస్తాయి, మరల ఈ అలవాట్లు పోవటానికి ఎన్ని జన్మలు పడుతుందో చెప్పలేము. వాస్తవ పరిస్థితులకు దూరంగా జీవించటం వలన మీకు ఎన్ని కోట్లు ఉన్నా చివరకు పతనమైపోతారు.

ఓ అరుణాచలా! నీ లీలలు అద్భుతాలు, నీ మహిమలు ఇట్టివి అని చెప్పటానికి వీలు లేదు. అది నోటితో చెప్పలేము, మన ఆలోచనలకు అతీతం. మీరు ఏదైనా ఇష్టమైన పదార్థం తిన్నారు అనుకోండి, ఎలా ఉంది అంటే బాగా ఉంది అని చెపుతారు. బాగోవటం అంటే ఎలా ఉంది అని అడిగితే మీరు చెప్పగలరా? చెప్పలేరు. అది మాటకు, రాతకు అందదు, అది మీ అనుభవం అంతే. మీరు తినే పదార్థం గురించే మీరు చెప్పలేనప్పుడు ఇక ఆత్మానందం, ఆత్మసుఖం గురించి ఇతరులకు ఎలా చెప్పగలరు? అది అనుభవైకవేద్యం. అనేక జన్మల కృషి ఉంటేనేకాని ఆత్మజ్ఞానం రాదు అని పరమాత్మ గీతలో చెప్పాడుకదా మరి మాకు ఈ జన్మలో వస్తుందా అని అడుగుతున్నారు. ఈశ్వరుడికి అన్నీ సాధ్యమే. ఈ జన్మలో రావటం ఏమిటి? ఈ క్షణంలో రావచ్చు అని చెప్పారు. ఎందుచేతనంటే పెట్టె మన దగ్గరే ఉంది కాని తాళం చెవి ఈశ్వరుడి దగ్గర ఉంది. ఆ హృదయకవాటాన్ని ఆయన ఓపెన్ చేస్తే హృదయంలో ఉన్న ఆనందం ఉబికి వచ్చి నీ సహస్రారాన్ని ముంచేస్తుంది. భగవంతుడు నామరహితుడు, రూపరహితుడు. రూపం లేనిదానిని, నామం లేనిదానిని మనం ఊహించ లేము కాబట్టి మన కోసం ఆయన ఇక్కడ గిరిరూపం ధరించాడు. అది నీకు కొండకింద కనిపించినా ఆయన సాక్షాత్తు ఈశ్వరుడే. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని గుర్తుకోసం అలా కనిపిస్తున్నాడు.

రామకృష్ణుడికి తోతాపురి అని గురువు ఉండేవాడు. రామకృష్ణుడికి ద్వైతం అంటే ఇష్టం. తోతాపురి అద్వైతశాస్త్రం బాగాచదువుకొన్నాడు. ఒకరోజున గురువుగారు అద్వైతం

గురించి, అది ఎలా అనుభవంలోనికి తెచ్చుకోవాలో చెపుతున్నాడు. ప్రక్కన ఎవరో పిల్లలు అల్లరి చేస్తున్నారు. గురువు గారికి విపరీతంగా కోపం వచ్చేసింది. ఇక్కడ మేము ఏదో మాట్లాడుకొంటూ ఉంటే మీ అల్లరి ఏమిటి? అని ఆ పిల్లలను తిట్టేస్తున్నాడు. అది చూసి రామకృష్ణుడు నవ్వుకొంటున్నాడు. అప్పడు గురువుగారికి ఈయనమీద కూడా కోపం వచ్చి ఎందుకు నవ్వుకొంటున్నావు అని అడిగాడు. వారు పిల్లకాయలు, వారిది అల్లరి చేసే వయస్సు, ఆ వయస్సులో ఎంతోకొంత అల్లరి చేస్తారు. అల్లరి చెయ్యకండి అని మామూలుగా చెప్పవచ్చును కదా, ఆ పిచ్చకేకలు ఏమిటి? ఇప్పటివరకూ అందరి హృదయంలో ఉన్నది ఒక్కటే అని చెపుతున్నావు. ఈ మాటలు కూడా సరళంగా చెప్పవచ్చునుకదా! నీ అద్వైతానుభవం పూర్తి అయిపోయింది, అద్వైతులు అంటే ఇలా ఉంటారు అని చెప్పాడు.

భగవాన్‌ను పొగుడుతూ ఎవరైనా పద్యాలు వ్రాస్తే నేను గొప్పవాడిని అయితే నీకు ఏమి కలిసివస్తుంది. నువ్వు బాగుపడే విధానం చూసుకో. ఆత్మజ్ఞానం పొందటానికి ఏ విషయాలు అయితే అడ్డు వస్తున్నాయో చూసుకొని సాధన చేసి వాటిని తొలగించుకో అని చెప్పారు. నీ మనస్సు ఆత్మానందం కోరుకోవటంలేదు, విషయానందం కోరుకొంటోంది. విషయానందంలో ఉన్నప్పడు మనస్సు ఆత్మానందం వైపుకు తిరగదు. నీకు భగవంతుడి పట్ల ఆకర్షణ కలుగుతూ ఉంటే విషయానందంలో నుండి బయటకు రాగలవు. భగవంతుడి పట్ల నీకు ప్రేమ లేకపోతే, భక్తిలేకపోతే విషయాలనుండి నువ్వు బయటకు రాలేవు. భగవంతుడిని ఎలా ప్రేమించాలి? ఆయన పాదాల దగ్గరకు ఎలా చేరుకోవాలి? భగవదనుభవం ఎలా పొందాలి? అనేది చూసుకో, వాటికి సంబంధించిన మహాత్ములతోటి, మహర్షులతోటి, గురువులతోటి సాంగత్యం అభివృద్ధి చేసుకో. అంతేగాని నన్ను పొగడటం వలన నీకు ఏమీ ప్రయోజనం లేదు, టైము వేస్టు అని చెప్పారు. గివింగ్, ఛారిటీ ఈ రెండు మాటలు మరిచిపోవాలి. ఈ మాటలు మీ మనస్సును ఉద్రేకపరుస్తాయి. మీరు ఎవరికైనా పదిరూపాయలు ఇస్తే మేము పదిరూపాయలు ఇచ్చాము అంటారు, ఏదైనా సంస్థకు డబ్బులిస్తే ఛారిటీ అంటే దానం చేసాము అంటారు. ఈ మాటలు మంచివి కాదు. ఈ మాటలు మీ మనస్సును పాడుచేస్తాయి. అందుచేత షేరింగ్ అనాలి. అన్నదమ్ములు పంచుకొంటున్నారు అనుకోండి అందులో దానం ఏముంది? ఎవరి షేర్ వాళ్ళు పుచ్చుకొంటున్నారు. షేరింగ్ అనేమాట మంచిదికాని గివింగ్, ఛారిటీ అనే మాటలు తగ్గించుకోవాలి.

నీకు కాళ్ళు ఉన్నాయి, వెళ్ళి సజ్జనుల దర్శనం చేసుకో. నీకు చెవులు ఉన్నాయి సజ్జనుల మాటలు విను. నీకు తలకాయ ఉంది శాస్త్రం ఏమి చెపుతోందో ఆలోచించుకో, ఇదంతా తపస్సులోకి వస్తుంది. భగవదనుభవం పొందటానికి ఏ విషయాలు అయితే అడ్డు వస్తున్నాయో వాటిని ఎండింపచెయ్యాలి, అదే తపస్సు. భగవంతుడి ఆజ్ఞను బట్టే అంతా నడుస్తోంది. భగవంతుడు నీకు సంపాదించిపెట్టిందే నేను సంపాదించాను అంటున్నావు.

ఇదే గీతలో పరమాత్మ అర్జునుడికి చెప్పాడు. నేను ఎవరినైతే చంపిపోగులు పెట్టి ఉంచానో వారినే నువ్వు చంపబోతున్నావు. పని భగవంతుడిది, గౌరవం నీకు. మన విషయంలోను అంతే. ఈ సంపద అంతా మనకు ఎవడు ఇచ్చాడు? భగవంతుడే ఇచ్చాడు. కాని మనం ఏమనుకుంటున్నాము? కష్టపడి సంపాదించాము అనుకొంటున్నాము. ఆయన అనుగ్రహం లేకపోతే నువ్వు కష్టపడితే మటుకు సంపద వస్తుందా, కేవలం నీ కష్టం వలన అది రాదు, ఆయన ఆజ్ఞనుబట్టే అది వచ్చింది. మీ పిల్లలు బాగా చదువుకొని అభివృద్ధిలోనికి వస్తే ఏదో కష్టపడి చదివించాము, అభివృద్ధిలోనికి వచ్చారు అని చెపుతారు. మీరు కష్టపడి చదివించారు, ఆ మాట నిజమే. వారు కష్టపడి చదువుకొంటే మీ కష్టం సద్వినియోగం అయిందా? వారు చదువుకోకుండా మీ కష్టం సద్వినియోగం అయిందా? మీరు కష్టపడ్డారు, వారు బాగా చదువుకొన్నారు అంటే ఇవన్నీ భగవంతుడు మీకు సమకూర్చాడు అన్నసంగతి మీరు మరిచిపోతున్నారు. నువ్వు చేసిన కర్మను బట్టి నీకు ఫలితం రావటంలేదు. ఆయన ఆజ్ఞను అనుసరించే ఫలితం వస్తుంది. శాస్త్రం చెప్పింది అబద్ధం అనుకొంటున్నావు, నువ్వు అనుకొనేది నిజం అనుకొంటున్నావు. అందుచేత అనుభవించవయ్యా, అనుభవించు అనేవారు భగవాన్. కర్త ఎవడు? ఈశ్వరుడు. కాని నేనే కర్తను అనుకోవటం వలన మీరు దుఃఖాన్ని అనుభవిస్తున్నారు. ఇదంతా మేమే చేసాము అంటారు. అసలు మీరు అంటూ ఉన్నారా చేయటానికి? ఇలా అనుకోటం వలన మీకు పాడైపోయే లక్షణాలు వస్తున్నాయి.

మీ స్నేహాలు నిలబడాలి అంటే మీకు ఎంతో కొంత సహృదయం ఉండాలి. ఎదుటి వారు ఏదైనా కష్టంలో ఉంటే మీరు తొందరపడి వారిని విమర్శించకూడదు. ఏ విషయంలో అయితే మనం వారిని విమర్శిస్తున్నామో అదే పరిస్థితిలో మనం ఉంటే అప్పుడు మన ప్రవర్తన ఎలా ఉంటుంది? అని చూసుకోవాలి. మీరు ఎవరినైనా చూసిన వెంటనే వారిపట్ల ఆప్యాయత కలిగినా, వారి సమక్షంలో మీకు శాంతి కలిగినా మీకు వారితో ఏదో జన్మాంతర అనుబంధము ఉండి ఉండాలి. పూర్వజన్మ అనుబంధం ఎంతోకొంత లేకపోతే ఆ స్నేహాలు నిలబడవు. చుట్టరికాలు అనేవి కేవలం శరీరానికి సంబంధించినవి, స్నేహాలు అనేవి మనస్సుకు సంబంధించినవి. ఆ స్నేహాలు నిలబడాలి అంటే ఇద్దరికీ సహృదయం ఉండాలి. ఎదుటివారు కష్టంలో ఉంటే మనకు చేతనైతే ఆ పరిస్థితుల నుండి వారిని విడదీయాలి లేకపోతే మౌనంగా ఉండాలి. స్నేహం అంటే వారి క్షేమం మీరు కోరాలి కదా! మీరు నిజమైన స్నేహితులు అనుకోండి. మీకు వచ్చిన కష్టం వారితో చెప్పకొంటే ఆ కష్టం కొంత తగ్గాలి, ఎందుచేతనంటే వారు కొంత షేర్ చేసుకొంటారు. తింగరవాళ్లతో చెపితే మీ కష్టాన్ని వాళ్ళు పంచుకోరు, పైగా మిమ్మల్ని అల్లరి చేస్తారు. బహుజన్మలు కృషి చేస్తే కాని ఆత్మజ్ఞానం కలుగదు అని పరమాత్మ చెప్పాడు కాని భగవంతుడి అనుగ్రహం కనుక ఉంటే అన్నీ సాధ్యమే. అయితే మన ప్రవర్తన ఎలా ఉండాలి అంటే మనం నోటితో మాట్లాడే మాట, చేతితో చేసేపని, మనకి వచ్చే తలంపులు అన్నీకూడా ఈశ్వరానుగ్రహం సంపాందించేలా ఉండాలి. ఏదో రాయిలా

పది నిమిషాలు కూర్చోవటం కాదు, దైనందినజీవితంలో మన ప్రవర్తన ఈశ్వరానుగ్రహాన్ని సంపాదించేలా ఉండాలి.

నువ్వు ఏదైతే అవునో దానిని వదిలేసి, నువ్వు ఏదైతే కాదో అదే నేను అనుకొంటూ ఉంటే నీవు సాధన చేయవలసి వస్తోంది లేకపోతే నీకు సాధన ఎందుకు? అన్నారు భగవాన్. నువ్వు ఏదైతే కాదో దానిలోనుండి బయటకు రావాలి. మీరు కాని శరీరాన్ని, మీరు కాని మనస్సును, మీరు కాని ప్రపంచాన్ని మీరు అనుకొంటున్నారు. మీరు కానిదానిని మీరు అనుకొంటున్నారు కాబట్టి దానినుండి ఎలా విడుదల పొందాలి అని ఆలోచిస్తూ మీరు సాధనలు మొదలుపెట్టారు. అలా మనలను ఎవరు అనుకోమన్నారు? అది ఒక అలవాటు. మీరు ఏదైతే అవునో దానిని స్మరిస్తూ, దానికోసం జీవిస్తూ, దానిని అనుభవంలోనికి తెచ్చుకొంటే ఏమీలేదు. మీరు కానిదానిని మీరు అనుకొంటూ ఉంటే ఉన్నది మీకు ఎలా తెలుస్తుంది? ఉన్నా దాని గురించి మీరు ఎప్పుడైనా శ్రవణం చేసారా? దానిని మననం చేసారా? అంటే ఏమీ చేయలేదు. ఇంక అది మీకు ఎలా తెలుస్తుంది. మీకు ఎప్పుడూ విషయానందమే. విషయానందంలో ఉన్నవాడికి, ఆత్మానందంవైపుకు వాడి మనస్సు తిరగదు.

దేహము లోపల నేను ఉన్నాను, నాకు బయట ప్రపంచం ఉంది, ఎక్కడో వైకుంఠంలో దేవుడు ఉన్నాడు అనే భావనలు ఇప్పుడు మనకు ఉన్నాయికదా! యిది ఉన్నంతకాలం నువ్వు సాధన చేయవలసిందే. ఈ మూడూ మూడు కాదు, ఈమూడూ ఒక్కటే అనేటటువంటి అనుభవం నీకు వచ్చినప్పుడు ఇంక సాధనతో పనిలేదు. బాగుపడాలి అనుకొనేవాడు ఆత్మస్తుతి, పరనింద ఈ రెండూ వదులుకోవాలి. నీ మనస్సు నిర్మలంగా, శాంతిగా ఉండాలంటే ఇతరులలో తప్పలు వెదకవద్దు. నువ్వెంత అంటే నువ్వెంత అని ప్రతీ మాటకు మనం సమాధానం చెపుతూంటే సమస్యలు పెరిగిపోతాయి. మన ప్రయత్నం లేకుండా మౌనం వలన, సహనం వలన కొన్ని సమస్యలు పరిష్కారం అయిపోతాయి. నా క్షేమం నేను కోరుకుంటున్నాను కదా! ఆ కోరుకొనేవాడు ఎవడు? నీ లోపల ఉండి ఒకడు ఈ ప్రపంచాన్ని చూస్తున్నాడు కదా! ఆ చూసేవాడు ఎవడు? వాడు అస్తమాను బయటకు చూడటానికి అలవాటు పడిపోయాడు. నువ్వు అస్తమానూ బయటకు చూస్తున్నావు, నీ లోపల ఏముందో ఒకసారి చూసుకోమని వాడిని లోపలకు త్రిప్పితే వాడు లోపలకు కొంతదూరం ప్రయాణం చేసి వాడి మూలం దగ్గరకు వెళ్ళి అణగిపోతాడు. అంటే దేహగతమైననేను పోతుంది, ఇంకో నేను హృదయాంతరాళము నుండి నీకు వ్యక్తమౌతుంది. అదే నిజమైననేను. దాని స్వభావం శాంతి. దాని స్వభావం ఆనందం. ఆ అనుభవం మీకు కూడా కావాలంటే భగవంతుడు ఇస్తాడు. మీరు పుచ్చుకోగలరా? మీరు దానిని పుచ్చుకోలేరు. అందుచేతనే ఆయన వెయిట్ చేస్తున్నాడు కాని మీరు అంటే ఇష్టంలేక కాదు. హృదయంలోనుండి మెదడులోనికి ఒకనాడి ఉంటుంది. అది జనరల్‌గా మూసుకొని ఉంటుంది. ఆ నాడిని ఓపెన్ చేయుటానికి జపాలు,

ధ్యానాలు, సాధనలు చేస్తున్నాము. భగవదనుగ్రహం వస్తే అది ఓపెన్ అవుతుంది. అది తెరుచుకొన్నప్పుడు హృదయంలో ఉన్న ఆనందం పొంగివచ్చి మీ సహస్రారాన్ని ముంచేస్తుంది. దానిని మీరు తట్టుకోలేరు కాబట్టి మీకు ఉన్న అర్హతను బట్టి రిలీజ్ చేస్తాడు. మీకు ఏదైనా కోరిక వచ్చినప్పుడు ఆ కోరిక వచ్చినట్లు మీకు తెలుస్తోంది కదా! అలాగే ఆనాడి ఓపెన్ అయినప్పుడు అది మీకు తెలుస్తుంది. దానిని అమృతనాడి అంటారు. అది ఎప్పుడు ఓపెన్ అవుతుందో మనం చెప్పలేము.

రామకృష్ణపరమహంస, రమణమహర్షిగారు పొందిన స్థితి మనం కూడా పొందుదాము అని మీరు అనుకుంటే అరుణాచలేశ్వరుడు మీకు కూడా ఇస్తాడు. మీరు ఏమనుకుంటున్నారంటే ఏదో మనం వింటున్నాం, వెళ్ళిపోతున్నాం ఆ స్థితి మనకి ఎక్కడ వస్తుంది అని మీరు అనుకోవచ్చు. ఆ స్థితి మీకుకూడా వచ్చేస్తుంది కానీ మీరు తట్టుకోగలరా! మీరు జిన్నూరు వంతెన దాకా కూడా వెళ్ళలేరు. అంటే చచ్చిపోవాలని చచ్చిపోరు. ఆ బ్లిస్‌ని భరించలేక చచ్చిపోతారు. గోదావరికి వరదలు వస్తే ఏటి గట్టు తెగిపోయి ఊళ్ళను ముంచేస్తోంది కదా? అలాగే మీకు ప్రిపరేషన్ లేదు అనుకోండి ఆ స్థితిమీకు వస్తే మీ రక్తనాళములు తెగిపోయి, మీరు చచ్చిపోతారు. పూర్వం దక్షిణామూర్తి సనత్‌కుమారుడు వాళ్ళకి మౌనం ద్వారా సత్యాన్ని బోధించాడు. వాళ్ళకి ప్రిపరేషన్ ఉంది, వాళ్ళు పండిపోయి ఉన్నారు కాబట్టి దానికి తట్టుకున్నారు, వాళ్ళకి సత్యం అనుభవంలోకి వచ్చింది.

సెల్ఫిష్‌వర్క్‌లో ట్రేడ్ ఉంటుంది. కానీ సెల్ఫ్‌లెస్‌వర్క్‌లో ట్రేడ్ ఉండదు. ప్రతీరోజు కొంత సెల్ఫ్‌లెస్‌వర్క్ చేయటం నేర్చుకొంటే మనస్సు అంతర్ముఖం అవుతుంది కాని మనస్సుని బలవంతాన అంతర్ముఖం చేయలేము కురుపుమీద పెచ్చు దానంతటదే ఊడిపోవాలి కాని మనం గట్టిగా లాగితే ఆ కురుపు మళ్ళీ చీము పడుతుంది. అలాగే మనస్సు దానంతట అది కరగాలి. మీరు సెల్ఫ్‌లెస్‌వర్క్ ద్వారానో, జపంద్వారానో, మహాత్ములను స్మరించటం ద్వారానో మీ మనస్సును హృదయంలో ఎక్కువసేపు ఉంచితే అది నెమ్మదిగా అక్కడ కరిగిపోతుంది. అప్పుడు నీ హృదయంలో ఉన్న సత్యం నీకు ఎరుకలోనికి వస్తుంది. అరుణాచలంలో మనకి గుడిలో ఉన్న శివలింగం ముఖ్యంకాదు. అది సెకండరీ. ఫస్ట్ కొండ. ఎందుచేతనంటే ఈశ్వరుడు మొదట అరుణాచలంలో గిరిరూపంలో వెలిశాడు. తరువాత లింగరూపం. తరువాత సిద్ధరూపం. ఇప్పుడు మనం రక్తమాంసాలతోటి ఎలా ఉన్నామో అలాగే ఆగిరిలో ఒక ప్లేస్‌లో రక్తమాంసాలతోటి ఉన్నాడు. ఆ రూపమే సిద్ధరూపం. సిద్ధరూపంలో ఇప్పడు కూడా ఉన్నాడని పురాణాలలో ఉంది. భగవాన్ ఆ సిద్ధరూపం దగ్గరకి వెడదామని ప్రయత్నం చేశారు. అక్కడకి వెడితే ఆయనలో కలిసిపోతాడు. అసలు మనిషే కనపడడు. అక్కడ ఐక్యం అయిపోతాడు. అందుచేత భగవాన్ అక్కడకి వెళ్ళటం అరుణాచలేశ్వరుడికి ఇష్టంలేదు. భగవాన్ అక్కడకి వెళ్ళటానికి ప్రయత్నం చేస్తుంటే భగవాన్ కాలు పొరపాటున తేనెటీగల

పుట్టమీద పడింది. ఆ తేనెటీగలు వచ్చి భగవాన్ కాలుమీద కుట్టేసాయి. ఆ బాధ భరించలేక భగవాన్ మళ్ళీ విరూపాక్షగుహకి వచ్చేశారు. ఎందుచేతనంటే భగవాన్ అక్కడకు వెడితే మనకి టీచింగులేదు. అందుచేత అరుణాచలేశ్వరుడు అక్కడకు వెళ్ళనివ్వలేదు.

నిన్ను రూపం అనుకుంటే ఇక్కడ కొండగా నిలచావు. ఇప్పుడు రూపాతీతుడవని భావించి మనస్సుతోటి పట్టుకోవాలంటే నువ్వు చిక్కటంలేదు. కారణం ఏమిటి అంటే, మీరు ఒకరూపం అనుకుంటున్నారు కదా! ఆపేరు నాది అని ఏదో అనుకొంటున్నారు కదా! ఈ అనుకోవటానికి లోపల చైతన్యానికి ఏమి సంబంధంలేదు. ఆ పేరు పెట్టి ఎవరైనా పొగిడితే సంతోషం వస్తుంది, ఆ పేరు పెట్టి ఎవరైనా తిడితే దుఃఖం వస్తోంది. ఎందుచేతనంటే ఆ పేరే అది అనుకుంటోంది, ఆ రూపమే అది అనుకుంటోంది. ఆ రూపనామాలు లేని సద్వస్తువు దీనికి ఎలా చిక్కుతుంది? మనల్ని బంధించేది రూపబుద్ధి, నామబుద్ధి. ఆ రూపబుద్ధిలోంచి, నామబుద్ధిలోంచి బయటకి వస్తే ఏమీ లేదు. నీ శరీరం నువ్వు కాదు. ఆ శరీరం నేను అనుకుంటున్నావు. మనం ఎంత వేదాంతం విన్నా శరీరం చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అనుకుంటావు కదా! నువ్వు కాని శరీరాన్ని నువ్వు అనే భ్రాంతి భగవంతుడు గట్టిగా పెట్టేశాడు. అది ఏ సాధన చేసినా పోవటంలేదు. మనం ఒక దూడని కొట్టాలి అనుకంటే ఆ దూడను ఒక కట్రాడుకి కట్టేస్తే కొట్టవచ్చు. మనం కొడదామని వెళ్ళేటప్పటికి ఆ దూడ తాడు తెంపేసుకొని వెళ్ళిపోతే ఆ దూడ కొట్టటానికి నీకు దొరుకుతుందా? దొరకదు. అది పారిపోతుంది. అలాగే నువ్వు పూర్వజన్మల్లో చేసిన కర్మ నీచేత అనుభవింపచేయటానికి నీకు దేహబుద్ధి బలంగా, లోతుగా పెట్టేసి నీ చేత అనుభవింప చేస్తున్నాడు. నీకు సడన్‌గా దేహబుద్ధి పోతుంది అనుకో ఇంక దేవుడు నిన్ను ఏమీ చేయలేడు. వాడికీ నీకూ సంబంధంలేదు. వాడికి దొరకవు కదా! మీరు పారిపోతారు అని తెలుసువాడికి. అందుచేత దేహబుద్ధి పోనివ్వటం లేదు. కానీ గురువు అలా ఉండడు. గురువు దేహబుద్ధి పోగొట్టటానికే చూస్తాడు. దేవుడి దగ్గర ప్రమాదం ఏమిటంటే అనుగ్రహిస్తాడు, ఆగ్రహిస్తాడు. పెడితే పెడతాడు, లేకపోతే కొట్టేస్తాడు. రెండూ ఉన్నాయి. దేవుడు వరాలు ఇవ్వాలనుకున్నప్పుడు వరాలు ఇస్తాడు. శపించాలనుకున్నప్పుడు శపిస్తాడు. కానీ గురువు ఒక పనే చేస్తాడు. అనుగ్రహించటం అనే పని చేస్తాడు కానీ నువ్వు ఎటువంటి పరిస్థితులలో ఉన్నా నిన్ను శపించడు. గురువు ఇస్తాడు కానీ కొట్టడు. మీరు బిడ్డలు కదా. దేవుడు జడ్జి. ఆయన మంచీ రాస్తాడు, చెడ్డా రాస్తాడు. గురువు జడ్జి కాదు కదా గురువు ఫాదర్. మీకు తలకాయ పోవలసింది పైన ఏ కిరీటమో, తలపాగో పోగొట్టేసి ఊరుకుంటాడు. అలా గురువు చేయగలడు. గురువు అంటే ఫాదర్.

బుద్ధుడి పుస్తకాలు ఏమీ చదవకుండా, ఆయనతోటి స్నేహం లేకుండా ఆయన సమక్షంలో కొన్నివందలమంది ఆత్మసుఖం పొందారు. అంటే అక్కడ ఉన్నదంతా కంపెషనే.

భగవాన్ సిద్ధాంతం మీద నమ్మకం ఉంటే అసలు మీకు దుఃఖ స్పర్శరాదు. భగవాన్ సిద్ధాంతం అర్థం చేసుకోవటం మాటవదిలేయండి, ఆ సిద్ధాంతం మీద మీకు నమ్మకం ఉంటే మీరు ఎన్ని దుఃఖాలు మధ్యలో ఉన్నా మీకు దుఃఖం రాదు. భగవంతుడు ఏది సంకల్పిస్తే అదే అవుతుంది. నువ్వు కూడా సంకల్పించుకో. ఎవరు వద్దు అన్నారు. కానీ నీ సంకల్పం అవ్వదు. ఏ రోజున నీ ఫిజికల్ బోడీకి డెత్ రావాలో ఆ రోజున వచ్చేస్తుంది. నువ్వు ఆరోగ్యంగా ఉన్నా సరే. ఊరికే నేచురల్‌గా గడియారం ముల్లు ఆగినట్లు నీకు శ్వాస ఆగిపోతుంది. ఏది ఎలా జరగాలో అలా జరిగిపోతూ ఉంటే మనం కష్టపడి సాధన చెయ్యటం ఎందుకు? నదులలో మునగటాలు ఎందుకు? గుడుల చుట్టూ తిరగటాలు ఎందుకు? ఈ హోలీ కంపెనీలు ఎందుకు? ఈ కొండ చుట్టూరా తిరగటం ఎందుకు? ఇంక సాధన దేనికి అని అడిగారు? సాధన దేనికి అంటే దేహం దాని కోర్సు ప్రకారం అది వెళ్లిపోతుంది. సాధన చెయ్యటంవలన ఒకవేళ చెడ్డ ప్రారబ్ధం ఉన్నా దాని ప్రభావం నీ మనస్సు మీద పడదు. నువ్వు సాధన చెయ్యడం వల్ల నో మైండు స్టేట్‌కి వచ్చేస్తావు అంటే అమనస్కస్థితికి వచ్చేస్తావు. అప్పుడు నీ ప్రారబ్ధం నూటికి నూరుపాళ్ళు చెడ్డగా ఉంది అనుకో, దాని ప్రభావం నీ మీద ఏమీ ఉండదు. అప్పుడు నీ ప్రారబ్ధం చెడ్డగా ఉంటే మటుకు నీకేముంది? అది నీది కాదు కదా! ఇది ఒక్క భగవాన్ సబ్జక్టు అర్థమైతేనే మీకు తెలుస్తుంది.

చనిపోయిన తరువాత స్వర్గమూ, నరకమూ ఉన్నాయా అని ఒకరు భగవాన్‌ను అడిగారు. ఉన్నాయి అన్నారు భగవాన్, చనిపోయిన తరువాత శరీరాన్ని ఇక్కడ కాల్చేస్తారు. చనిపోయిన తరువాత ఏ జీవుడు అయితే ప్రయాణం చేస్తాడో, ఆ జీవుడు ఎంత నిజమో, ఆ స్వర్గం, ఆ నరకం కూడా అంతే నిజం అన్నారు. అంటే ఈ వెళ్ళేవాడు నిజమా, వాడు నిజం కాదు. జీవుడు ఎంత అబద్ధమో, ఆ లోకాలు కూడా అంతే అబద్ధం. దేవుడు ఉన్నాడా? లేడా? అని అడిగారు. ఉన్నాడు అని చెప్పలేదు, లేడు అని చెప్పలేదు. నువ్వు ఉన్నావా? లేదా? నేను ఉన్నాను. నువ్వు ఉంటే ఆయన ఉన్నాడు. నువ్వు లేకపోతే ఆయన లేడు. మీకు తలంపు వచ్చినప్పుడు కదా దేవుడు గొడవ. నీకు తలంపు లేనప్పుడు దేవుడు గొడవ ఎక్కడ ఉంది. నీకు తలంపు వచ్చిన తరువాత కదా స్వర్గం, నరకం అని. తలంపు లేనప్పుడు నీకు స్వర్గం, నరకం అని ఏముంది? చావు అనేది ఒక తలంపు. పుట్టుక అనేది ఒక తలంపు. నీకు తలంపులు లేకపోతే చావు ఎక్కడ ఉంది? పుట్టుక ఎక్కడ ఉంది? నీకు గాఢనిద్రలో తలంపులు లేనప్పుడు చావు పుట్టుకల గొడవలేదు. ఈ శరీరం నేను అనే తలంపు వచ్చాక మిగిలిన తలంపులన్నీ వస్తున్నాయి. అందుచేత నువ్వు అనుకునే శరీరం, నీకు వచ్చే లాభాలు, నష్టాలు, గౌరవాలు, అగౌరవాలు, నీ దేవుళ్ళు, చనిపోయిన తరువాత వెళ్ళే స్వర్గాలు, నరకాలు ఇవన్నీ నిజం కాదా అంటే నిజమే. ఈ నేను ఎంత నిజమో అవి కూడా అంతే నిజము. ఇవి వ్యవహారిక సత్యాలేకాని, పూర్ణసత్యం కాదు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| అక్టోబర్ | 24 | శ్రీ వై.ఎన్. కళాశాల ఆడిటోరియం, నరసాపురం |
| అక్టోబర్ | 31 | శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# మానవ జన్మ - సార్థకత

అనేక జన్మల పుణ్యఫలితంగా పరమాత్మచే ప్రసాదింపబడిన మానవ శరీరము తానెవరో? తెలిసికొని అమృతస్థితిని పొందుటకు ఉద్దేశింపబడినదని విస్మరించి, దేహమే తాననుకొని ఇంద్రియముల ద్వారా మిథ్యావస్తువులపై అభిమానము పెంచుకొని, వాసనలను ప్రోగుచేసుకొని, కర్మబంధంలో పడుతున్నాం. మనము 'నేను - నాది' అనెడి రెండు సంకెళ్ళతో కట్టబడి, దుఃఖానికి, అశాంతికిలోనై అమూల్య మైన మానవ జన్మను వృథా చేసుకొంటున్నాం. 'నేను' అనగానే మనకు చైతన్యానికి బదులు దేహం స్ఫురిస్తోంది. దేహమే సర్వస్వం అనుకొని మనకు మనమే ఓ సమస్యగా తయారవుతున్నాం. స్వరూప ఎరుకకు అడ్డువచ్చేది మనస్వార్థమే! యద్భావం తద్భవతి అన్నారు. అనగా మన తలంపులు ఎలాగ ఉంటాయో, మనం పొందే ఫలితాలు అలాగే ఉంటాయి, కాబట్టి నిర్మలమైన, పవిత్రమైన తలంపులతో మనస్సును నింపుకోవాలి. మన త్రికరణాలు హృదయాన్ని కేంద్రంగా కలిగి పని చెయ్యాలి, అనగా మన త్రికరణాల ద్వారా అహంకారం వ్యక్తం కాకూడదు. వాస్తవంగా 'నేను' అంటే దేహేంద్రియ మనోబుద్ధులకు అతీతమైన, కాలాతీతమైన అమృతస్థితి. ఆత్మజ్ఞాన సముపార్జనకు వివేకము, విచక్షణలను ఆశ్రయించాలి. సద్గురు బోధను ఆచరణలో పెట్టుకోవాలి. ఏరోజుకారోజు వాసనా బలం తగ్గాలి. వ్యవహార దృష్టిని అతిక్రమించి, స్వరూప అమృతస్థితిని అనుభవైకవేద్యం చేసుకొనేవరకు జనన మరణ సంసారం, దుఃఖం, అశాంతి తప్పవు. మన ఆధ్యాత్మిక ప్రయాణంలో ప్రతిక్షణం మార్గదర్శిగా నిలుస్తూ, స్వరూప ఎరుకలోకి మేల్కొలుపుటకు గురువు చేసే మేలు అమూల్యం. జీవిత పరమార్థం నెరవేర్చుకోవడానికి మానవ జన్మ చక్కటి అవకాశం.

**- చావలి సూర్యనారాయణమూర్తి,** అమలాపురం

